క్లుప్తంగా

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం



నగదు, బహుమతులు అందజేస్తున్న అప్పారావు

ఎచ్చెర్ల క్యాంపస్: కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మెరిట్ సాధించిన విద్యార్థులకు బొడ్డేపల్లి లక్ష్మీనారాయణ ఎడ్యుకేషన్ ట్రస్ట్ సభ్యులు శనివారం నగదు బహుమతి అందజేశారు. బొడ్డేపల్లి సౌజన్య, గంట్లాన హేమంత్‌కుమార్, లొట్ల సంధ్యలకు రూ.1116 చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో బొడ్డేపల్లి అప్పారావు, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరామర్శ..



ఆర్థికసాయం అందజేస్తున్న గొర్లె కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల: లావేరు మండలం బుడుమూరు గ్రామానికి చెందిన రాష్ట్ర అర్బన్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కింతలి రమేష్‌బాబు(కోటి) ఇటీవల మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆ కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. రమేష్ బాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తనవంతు కొత్తమొత్తాన్ని ఆర్థికసహాయాన్ని అందించారు. పరామర్శించిన వారిలో పెదనాయిని చిట్టిబాబు, బొడ్డ రవిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు పెదనాయిని, సత్యనారాయణ, కుప్పిలి అప్పన్న, కింతలి రమణ, నల్లి ఆదినారాయణ, కింతలి గోపాలరావు, కుప్పిలి శివ తదితరులు ఉన్నారు.

ఐశ్వర్య ప్రతిభ



ఐశ్వర్యను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని కేశవ రెడ్డి ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జి.ఐశ్వర్య.. శ్రేష్ట పథకం –2024 పరీక్షలో సత్తాచాటింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన ఈ పరీక్షలో ఆల్ ఇండియా కేటగిరిలో 570 ర్యాంకు సాధించింది. అమేయ వరల్డ్ పాఠశాలలో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఉచిత విద్య చదివేందుకు అర్హత సాధించింది. విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు శనివారం అభినందించారు. భవిష్యత్తులో జేఈఈలో ఉత్తమ ర్యాంకు సాధించడమే తన లక్ష్యమని విద్యార్థిని తెలిపింది. పాఠశాల ఉపాధ్యాయులు పోత్సాహం వల్ల ఈ ర్యాంకు సాధ్యమైందని చెప్పింది.

ల్యాప్‌టాప్ వితరణ



ల్యాప్‌టాప్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

జి.సిగడాం: స్థానిక జెడ్పీహెచ్ ఎస్‌లో 1991లో పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు కలిసి శనివారం తోటి విద్యార్థి గుంటుకు జోగారావు కుమార్తె శ్రీరంజితకు రూ.32 వేల విలువ చేసే ల్యాప్ టాప్, ఇతర సౌకర్యాలు కల్పించారు. శ్రీరంజిత ఉన్నత చదువుల కోసం పూర్వ విద్యార్థులంతా చేయూత ఇచ్చేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని బ్యాచ్ కమిటీ సభ్యులు తెలిపారు.

స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్ రామ్‌ప్రతాప్

శ్రీకాకుళం రూరల్: నైరా ప్రాథమిక పాఠశాల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానిక సర్పంచ్ అరవల రామ్‌ప్రతాప్ శనివారం ఎమ్మెల్యే గొండు శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. పొన్నాం, బట్టేరు గుండా లారీలు, ట్రాక్టర్లు, సివిల్ సప్లయ్ గోదాములకు వచ్చే లారీల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు.

ఇసుక లారీ సీజ్

ఎచ్చెర్ల క్యాంపస్: తోటపాలెం సమీపంలో నాగావళి నది నుంచి లోడింగ్ చేసి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని శనివారం వేకువజామున కుశాలపురం బైపాస్ కూడలి వద్ద ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలోని సిబ్బంది పట్టుకున్నారు. అనంతరం ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌కు వాహనం తరలించి సీజ్ చేశారు. ఇసుక అనధికార రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

నిందితులను శిక్షించాల్సిందే

- అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో నిలిచిపోయిన ఓపీలు
- నిందితులకు శిక్షించాలని వైద్యులు, సిబ్బంది డిమాండ్



శ్రీకాకుళం డేఅండ్‌నైట్ జంక్షన్‌లో వైద్యులు, వైద్య విద్యార్థుల నిరసన

శ్రీకాకుళం: కోల్‌కతాలో విధుల్లో ఉన్న వైద్యురాలిపై జరిగిన హత్యాచారానికి నిరసనగా శ్రీకాకుళంలోని ప్రైవేటు, ప్రభుత్వ వైద్యులు, వైద్య సిబ్బంది శనివారం చికిత్సలను నిలిపివేయడంతో వైద్య సేవలు స్తంభించాయి. ఐఎంఏ పిలుపు మేరకు శనివారం వైద్యులు, సిబ్బంది విధులు బహిష్కరించారు. అత్యవసర చికిత్సలకు మాత్రమే హాజరయ్యారు. రిమ్స్ వైద్యులు విధులను బహిష్కరించి జూనియర్ డాక్టర్ల ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసన దీక్షల్లో పాల్గొని నినాదాలు చేశారు. సాయంత్రం రిమ్స్ నుంచి డేఅండ్‌నైట్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు సనపల నర్సింహమూర్తి, గొండు గంగాధర్, లుకలాపు ప్రసన్నకుమార్‌లు మాట్లాడుతూ నిందితులకు శిక్షపడేంత వరకు ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునావృతం కాకుండా జాతీయ రక్షణ చట్టాన్ని వైద్యులకు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ దానేటి శ్రీధర్, డాక్టర్ జి.వెంకటేష్, డాక్టర్ మోహిత్ కుమార్, డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ పార్వతి, డాక్టర్ రవితేజ, డాక్టర్ పార్థసారధి, డాక్టర్ రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు. నిరసనలో స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారులు కూడా భాగస్వామ్యమయ్యారు. వైద్య విద్యార్థుల నిరసనగా డీసీసీబీ ఉద్యోగులు సంఘీభావం తెలుపుతూ శనివారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

శ్రీకాకుళం రూరల్: కోల్‌కోతా ఘటన అమానుషమని జెమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీలలిత అన్నారు. రాగోలు జెమ్స్ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్ల నిరసనకు సంఘీభావం తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో అకడమిక్ డైరెక్టర్ సుదీర్, సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం: కొవ్వొత్తులతో సంఘీభావం తెలియజేస్తున్న డీసీసీబీ ఉద్యోగులు

ఎచ్చెర్ల క్యాంపస్/ఎచ్చెర్ల: కోల్‌కత్తాలోని ఆర్.జి.కర్ మెడికల్ కళాశాల పీజీ విద్యార్థిని హత్యను వైద్య వర్గాలు ఖండించాయి. ఎచ్చెర్ల మండల పరిధిలోని ఎచ్చెర్ల, పొన్నాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది శనివారం నిరసన తెలియజేశారు. ఎచ్చెర్ల పీహెచ్‌సీ నుంచి ఎచ్చెర్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. వైద్యుల రక్షణకు సెంట్రల్ ప్రొటక్షన్ యాక్ట్ ప్రవేశపెట్టి చట్టం చేయాలని డిమాండ్ చేశారు. వైద్యులు శేషగిరి, ప్రియదర్శిని, సౌమ్య, ఉషశ్రీ, సిబంది పాల్గొన్నారు.

జి.సిగడాం: దోషులను కఠినంగా శిక్షించాలని జి.సిగడాం, బాతువ ఆరోగ్య కేంద్రాల వైద్యులు బుడుమూరు యశ్వంత్, పేకల సుమబింధు, ప్రతిజ్ఞ శర్మ, జి.అనూష డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. సీహెచ్ఓ శివప్రసాద్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ లు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: దోషులను కఠినంగా శిక్షించాలని శ్రీకాకుళం రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలకం అధికారులు, విద్యార్థులు డిమాండ్ చేశారు. సెల్ ఫోన్ల వెలుగులో నేరస్తులకు, అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఐదు కిలో మీటర్ల ర్యాలీ నిర్వహించారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో డైరెక్టర్ ప్రొఫెసర్ కేవీజీడీ బాలాజీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న వైద్యులు, సిబ్బంది



శ్రీకాకుళం రూరల్: జెమ్స్‌లో వైద్య విద్యార్థుల ధర్నా



జి.సిగడాం: నిరసన తెలియజేస్తున్న వైద్యులు



ఎచ్చెర్ల క్యాంపస్: ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్జీయూకేటీ అధికారులు, విద్యార్థులు

29న ఐటీఐ మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం డీఎల్‌టీసీ/ఐటీఐ శిక్షణా కేంద్రంలో మిగులు సీట్ల భర్తీకి 3వ ఫేజ్‌లో దరఖాస్తుకునే అభ్యర్థులకు ఈ నెల 29న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ వై.రామ్మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా అభ్యర్థులు ఐటీఐ.ఏపీ.జీవోవి.ఇన్ అనే వెబ్‌పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 29న ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం బలగ హాస్పటల్ జంక్షన్‌లో ఉన్న డీఎల్‌టీసీ/ఐటీఐ శిక్షణా కేంద్రంలో జరిగే కౌన్సెలింగ్‌కు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. రెండేళ్ల కాలపరిమితి కలిగిన డ్రాఫ్ట్‌మ్యాన్ సివిల్, ఏడాది కోర్సు కలిగిన కోపా, సూయింగ్ టెక్నాలజీ(టైలరింగ్–మహిళలకు) కోర్సుల్లో మాత్రమే ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు.

రెడ్‌క్రాస్‌కు ఫ్రీజర్ వితరణ



ఫ్రీజర్ బాక్సును అందిస్తున్న దాతలు

శ్రీకాకుళం కల్చరల్: నగరానికి చెందిన బత్తుల వెంకటరావు, కుసుమాంబ దంపతుల జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు రెడ్‌క్రాస్‌కు రూ.65 వేలు విలువైన ఫ్రీజర్ బాక్స్ వితరణ చేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ నేత్రదాతలకు ఫ్రీజర్‌ను ఉచితంగా అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ట్రెజరర్ కనుగుల శ్రీనివాసరావు, కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, వైకుంఠరావు, కల్యాణ్ చక్రవర్తి, సిరిపురపు చక్రకుమార్, శ్రీకర్, వలంటీర్లు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం రూరల్: మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దామని, మౌలిక వసతుల కల్పన దిశగా వసతులు చేకూర్చుకుందామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ అంబటి నిర్మల అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలుపై చర్చించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాసరావు పనితీరు బాగులేదని, ఎటువంటి సమస్యలకు ఆయన స్పందించడం లేదని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. 2014–19కు సంబంధించి హౌసింగ్ పెండింగ్ బిల్లు ఇంకా మంజూరు కాలేదని కనుగులవానిపేట సర్పంచ్ గంగు వెంకటరమణ అధికారులను నిలదీశారు. జెమ్స్ ఆసుపత్రి నుంచి ఐదేళ్లగా రూ.80లక్షలు టాక్సు బకాయిలు ఉన్నాయని రాగోలు సర్పంచ్ గేదేల చెంగల్వరావు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. రాగోలు పంచాయతీ మీదుగా ఔటర్ రింగ్‌రోడ్డు భవిష్యత్‌లో మంజూరు చేస్తామని, నగరపాలక సంస్థలో రాగోలు గ్రామాన్ని విలీనం చేసేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు ఆమోదం కావాలని ఎమ్మెల్యే కోరారు. కరజాడ గ్రామాన్ని మోడల్ పంచాయతీగా తీర్చుదిద్దుతామని, జల జీవన్ మిషన్ ద్వారా 550 కనెక్షన్‌లు అందిస్తూ పైలట్ ప్రాజెక్టుగా గుర్తిస్తామని చెప్పారు. సమావేశంలో జెడ్పీటీసీ రుప్పదివ్య, ఎంపీడీఓ ప్రకాశ్‌రావు, తహశీల్దార్ గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

రోటరీ అవార్డులు ప్రదానం



రోటరీ అవార్డును అందజేస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం అర్బన్: రోటరీక్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో ఉత్తమ సేవలను గుర్తించి రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ మల్లా వెంకటేశ్వరరావు సారధ్యంలో శనివారం రోటరీ అవార్డులు అందజేశారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు కె.ఎస్.వి.దుర్గారావు, కార్యదర్శి కింతలి నాగేశ్వరరావు సమక్షంలో క్లబ్ సీనియర్ అధ్యక్షులుగా గుర్తించి ఉత్తమ సేవలకు రోటరీ సేవా భూషణ్, రోటరీ సేవా రత్న రోటరీ సేవాశ్రీ అవార్డులను ప్రదానం చేశారు. అవార్డులు అందుకున్న వారిలో వి.వి.గోవిందరాజులు, అంధవరపు శంకరనారాయణ, కొంచాడ సోమేశ్వరరావు, హనుమంతు నారాయణదొర, మండల రవిశంకర్, ఇప్పిలి కృష్ణారావు, కె.ఎ న్.వి.దుర్గారావు, కంకటాల శోభారామకృష్ణ, కె.వి.కామేశ్వరరావు, ద్వారపు గోపాలరావు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు బరాటం శ్రీరామమూర్తి, పిసిని వెంకటసత్యనారాయణ, పిసిని హరి, ఎస్.నాగేశ్వరరావు, కె.టి.నాయుడు, ఎ.చక్రపాణి, పట్నాల వాసుదేవరావు, ఎన్.నరసింహమూర్తి, మండా నాగేశ్వరరావు, బరాటం చంద్ర, బరాటం భరత్‌భూషణ్ పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి



రక్తదాతకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న డాక్టర్ బొడ్డేపల్లి సురేష్

శ్రీకాకుళం అర్బన్ : యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షుడు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ పిలుపునిచ్చారు. నగరంలోని ఏ వన్ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న ముక్తంపాలెంకు చెందిన సింహాద్రి బాలసురేష్ కుమార్తె 11 నెలల చిన్నారి సింహాద్రి ఖుష్మితకు ప్లేట్లెట్స్ నలభై వేలకు పడిపోవటంతో వైద్యుల సలహా మేరకు నగరానికి చెందిన లయన్స్ క్లబ్ సభ్యుడు పాడుగు చరణ్ రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలు చరణ్, పొందూరు మండలం మజ్జిలపేటకి చెందిన వావిలపల్లి రామ్‌ప్రసాద్, గురుగుబెల్లి రవికుమార్, సీపాన వాసుదేవరావు, బరాటం చంద్రశేఖర్‌లకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మార్కెటింగ్ చైర్‌పర్సన్ ఉర్లం శివతేజ, మదర్స్ లవ్ ఫౌండేషన్ సుప్రజ రౌత్, అల్లాడ నవీన్, సిక్కోలు స్వచ్ఛంద సేవ సమితి పాడుగు అవినాష్, రత్నాల మహాలక్ష్మి, లయన్స్ బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యారబాటి వందన, కరగాన దుర్గారావు పాల్గొన్నారు.

అంకితభావంతో సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్ : మీకోసంలో వచ్చే ఫిర్యాదులను అంకితభావంతో పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు సూచించారు. శనివారం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి జిల్లా అధికారులతో వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా 2047 నాటికి వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా వివిధ శాఖలు ఏర్పర్చుకున్న వంద రోజులు, సంవత్సర ప్రణాళికలపై శాఖలవారీగా సమీక్షించారు.

జాతీయ రక్షణ చట్టం అమలుచేయాలి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జాతీయ రక్షణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే అమలుచేయాలని జ్యోతిరావు పూలే ఆల్ ఇండియా ఓబీసీ ఉత్తరాంధ్ర జనరల్ సెక్రటరీ రౌతు శంకరరావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. కోల్‌కత్తాలో వైద్యురాలిపై హత్యాచారం ఘటనలో బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో శనిత్రయోదశి పూజలు



కోటేశ్వరాలయంలో శనీశ్వరుడికి పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు ఆలయాలలో శనిత్రయోదశి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గుడివీధిలోని ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయంలోని నవగ్రహ మండపం, నక్కవీధిలోని ఉమా జఠలేశ్వరస్వామి దేవాలయం, బొందిలీపురం బాయమ్మతోటలోని సంజీవరాయ ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

కూటమి నాయకుల ఎత్తులు చిత్తు..

- ఎస్ఎంసీ ఎన్నికల్లో పాతర్లపల్లిలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులదే విజయం



రణస్థలం: పాతర్లపల్లి హైస్కూల్లో వద్ద కూటమి నాయకులతో మంతనాలు జరుపుతున్న పోలీసులు



రణస్థలం: సాయికుమార్‌తో పాతర్లపల్లి స్కూల్ కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు

రణస్థలం: పాతర్లపల్లి హైస్కూల్ స్కూల్ కమిటీ ఎన్నిక శనివారం నిర్వహించారు. 24 మెంబర్లకు ఎన్నిక జరపగా 24 మంది వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు గెలిచారు. టీడీపీ మద్దతుదారులకు ఒక్క మెంబర్ కూడా రాలేదు. మెంబర్లులంతా కలిసి స్కూల్ కమిటీ చైర్మన్‌గా చుక్క శ్రీరాములు, వైస్ చైర్మన్‌గా మాగుపల్లి యర్రయ్యను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు భారీగా పోలీసులను, ప్రత్యేక బలగాలు మోహరించడంతో ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురయ్యారు. పాతర్లపల్లి మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ స్వగ్రామం. 436 మంది తల్లిదండ్రులకు ఓటు హక్కు ఉంది. ఎక్కువ మంది వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకు అండగా నిలబడ్డారు. ఈ విషయాన్ని గ్రహించి ఎన్నిక మరళా వాయిదా వేయాలని కుటిల రాజకీయానికి కూటమి నాయకులు ఉదయం తెరలేపారు. ఉపాధ్యాయులు, పోలీసులపై అధికార పార్టీ ఉన్నత స్థాయి నాయకులతో రాజకీయ ఒత్తిళ్లు చేయించారు. పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో కొంతసయం మంతనాలు జరిపినా అవీ సఫలీకృతం కాలేదు. పరిస్థితి గమనించిన పోలీసులు శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పర్యవేక్షిస్తామే తప్ప.. ఉపాధ్యాయులతో చర్చలు జరపాల్సిన అవసరం లేదని తప్పించుకున్నారు. ఉద్యోగాలు పోతాయని ఉపాధ్యాయులు ససేమిరా అనడంతో ఎన్నిక అనివార్యమైన సూచనలు రావడంతో టీడీపీ నాయకులు అక్కడ నుండి ఊడాయించారు మధ్యాహ్నం ఎన్నిక నిర్వహించి కమిటీ సభ్యులను, చైర్మన్, వైఎస్ చైర్మన్‌ను ఎన్నుకున్నారు.

స్కూల్ కమిటీ సభ్యులకు అభినంధనలు..

పాతర్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ ఎన్నికల్లో చైర్మన్‌గా గెలిచిన చుక్క శ్రీరాములు, వైస్ చైర్మన్ మాగుపల్లి యర్రయ్యలు, కమిటీ సభ్యులకు ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అభినందనలు తెలిపారు. ఈ అభినందన కార్యక్రమంలో పాతర్లపల్లి సర్పంచ్ గొర్లె రాధకృష్ణ, ఉప సర్పంచ్ జగ్గురోతు అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు మైలపల్లి పిల్లతాత, ఉప్పాడ అప్పన్న, మహంతయ్య, పిన్నింటి శ్రీచరణ్, లోలుగు కృష్ణ, ముఠామేస్త్రీ, మైలపల్లి గురువులు, మాగుపల్లి పాట్టివాడు, గొర్లె రమణ తదితరులు ఉన్నారు.

రెండు పాఠశాల్లో ఎన్నికలు పూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: బొంతలకోడూరు, చిలకపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలు, ఇబ్రహింబాద్ ప్రాథమిక పాఠశాలల్లో శనివారం ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. బొంతలకోడూరు జెడ్పీ, చిలకపాలం జెడ్పీ పాఠశాలల్లో కమిటీలను ఎన్నుకున్నారు. బొంతలకోడూరులో అధికార పార్టీ నాయకులు ఏకపక్షంగా విద్యార్థుల తల్లిదండ్రుపై ఒత్తిడి తెచ్చారు. సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు నిబంధనలపై ఎన్నికలు అధికారి, హెచ్ఎం శేఖర్ బాబుకు ఫిర్యాదు చేశారు. ప్రాథమిక పాఠశాల ఎస్ఎంసీ ఉపాధ్యక్షురాలను ఆరువ తరగతి సభ్యురాలుగా ఎంపిక చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మరో పక్క చిలకపాలేంలో కూటమి నాయకులు చిలక రాము, గాడు రామారావు రెండు వర్గాలుగా ఎన్నికల్లో తలపడ్డారు. ఇబ్రహింబాద్‌లో మళ్లీ కోరం లేక వాయిదా వేశారు. ఎన్నికలకు మరోసారి నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు ఎంఈఓ కె.పున్నయ్య తెలిపారు.

ఎస్ఎంసీ ఎన్నికలు వాయిదా..

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని బెజ్జిపురం–2 ప్రాథమిక పాఠశాల, చిగురుకొత్తపల్లి, గురుగుబిల్లి గ్రామాల్లో ప్రాథమికోన్నత పాఠశాలల్లో శనివారం ఎస్ఎంసీ ఎన్నికలను నిర్వహించినట్లు ఎంఈఓలు ఈశ్వరరావు, మురళీకృష్ణ తెలిపారు. ఈ పాఠశాలల్లో కోరం లేకపోవడం వల్ల ఎన్నికలను వాయిదా వేయడం జరిగిందన్నారు. గురుగుబిల్లి ప్రాథమిక పాఠశాలలో ఎన్నికలు పూర్తయ్యాయన్నారు. ఈ ఎన్నికల్లో గురుకుల ప్రధానోపాధ్యాయులు ఎండ ఉమాశంకర్, ప్రధానోపాధ్యాయులు జగదీశ్వరరావు, సర్వశిక్ష అభియాన్ నుంచి అసిస్టెంట్ స్టాటికల్ అధికారి శ్రీనివాసరావు పాల్గొని నిర్వహించారు.

ఆకట్టుకున్న గాత్ర కచేరి



పట్టాభిరామ్ పండిట్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు



కీర్తనలు ఆలపిస్తున్న పట్టాభిరామ్

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బాపూజీ కళామందిర్‌లో సరస్వతి సంగీత విద్యాలయం, శ్రీకాకుళం మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ, మావుడూరు మ్యూజిక్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం బెంగళూరుకు చెందిన పట్టాభిరామ్ పండిట్ గాత్ర కచేరి వీనులవిందుగా సాగింది. ముత్తుస్వామి దీక్షితులు, అన్నమయ్య, త్యాగయ్య కీర్తనలను చక్కగా ఆలపించారు. వయొలిన్‌పై మావుడూరు సత్యనారాయణశర్మ, మృదంగంపై మావుడూరు సూర్యప్రసాదరావు, ఘటంపై బంకుపల్లి దుర్గా శ్రీనివాస శర్మలు వాద్య సహకారం అందించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.సుధీర్, కె.అమ్మన్నాయుడు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, నరసింహరావు, బాణ్ణ సంజీవరావు, స్వాతి సోమనాథ్, సంస్థ గౌరవ అధ్యక్షులు డాక్టర్ పి.మాలతి, ప్రెసిడెంట్ జె.వెంకటేశ్వరరావు, దుంపల ఈశ్వరరావు, నిక్కు అప్పన్న, బండారు చిట్టిబాబు, భాస్కరభట్ల శ్రీరామశర్మ తదితరులు పాల్గొన్నారు.